క్లుప్తంగా

మధుమేహ పరీక్షలు

పాన్‌గల్: మండలంలో షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న పరీక్షలు కొనసాగుతున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొనసాగుతున్న పరీక్షలను వారు పరిశీలించారు. మండలంలోని 10 సబ్ సెంటర్ల పరిధిలో సిబ్బంది 867 మందికి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మండలంలోని చిక్కేపల్లిలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యులు తారాశశాంక్ ఆధ్వర్యంలో మధుమేహ పరీక్షలు నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

కబడ్డీ విజేత కంచిరావుపల్లి జట్టు

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో మహాశివరాత్రి సందర్భంగా వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో పెబ్బేర్ మండలంలోని కంచిరావుపల్లి కేవీఆర్ క్లబ్ జట్టు ప్రథమ స్థానం, రేమద్దుల సన్‌రైజర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. గురువారం రాత్రి హోరాహోరీగా జరిగిన పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు వ్యాపార వేత్త పీట్ల కతాల్ రూ.50 వేలు నగదు, ద్వితీయ బహుమతి రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో రూ.30 వేలు నగదు, షీల్డ్‌లను అందజేశారు. కబడ్డీ క్రీడలు ప్రశాంతంగా జరిగేలా సహకరించిన దాతలు, గ్రామస్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

అమరుల ఆశయ సాధనకు కృషిచేద్దాం

వీపనగండ్ల: దళితుల ఏ, బీ, సీ, డీ వర్గీకరణ సాధనలో అమరులయిన వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మార్చి 1ని అరవీరుల దినోత్సవంగా నిర్వహించాలని ఆయనకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బండారు విష్ణు, నవీన్, నంది, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

1962 అంబులెన్స్‌ల తనిఖీ



వనపర్తి రూరల్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జీవీకే ఈఎంఆర్‌ఐ 1962 పశువర్ధక అంబులెన్స్‌లను శుక్రవారం రాష్ట్ర 1962 ప్రాజెక్టు హెడ్ డాక్టర్ బగీష్‌మిశ్రా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంబులెన్స్‌లోని వివిధ పరికరాలు, వాటి పనితీరు, మందులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే 1962 సిబ్బంది తక్షణమే స్పందించి పశువులకు సేవలు అందించాలన్నారు. జిల్లాలో ప్రతి అంబులెన్స్ 10 ట్రిపులు చేస్తూ.. 20 పైన పశువులకు వైద్యం అందిస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ రవి, ఎగ్జిక్యూటివ్ రత్నమయ్య, డాక్టర్ మానసరెడ్డి, సిబ్బంది రాము, చెన్నయ్య ఇబ్రహీం పాల్గొన్నారు.

రాయితీ పొందండి

ఆత్మకూర్: ఇంటి స్థలాల యజమానులు మార్చి 31 లోపు ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించి 25 శాతం రాయితీ పొందాలని పురపాలిక కమిషనర్ చికినె శశిధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. 2020 లో రూ.వెయ్యి చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్‌కు దరకాస్తులు చేసుకున్న ప్లాట్ల యజమానులు ఆన్‌లైన్‌లో నిర్ధేశించిన రుసుం చెల్లించాలని, ఏవైనా అనుమానాలు ఉంటే కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ 95026 39749 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

స్థలం కేటాయించండి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో సాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని చూపాలని కోరుతూ శుక్రవారం ఖిల్లాఘనపురం రజక సంఘం ఆధ్వర్యంలో రజకులు తహసీల్దార్ సుగుణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కుంచరపు రవీందర్, మొల్గర శ్రీనివాసులు, తిరుపతయ్య, గణేష్, మాసయ్య, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పడవ షికారు ప్రారంభం

ఆత్మకూర్: మున్సిపాలిటీ శివారులోని పరమేశ్వరస్వామి చెరువులో టూరిజం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పడవ షికారు ట్రయల్ రన్ ప్రారంభించారు. పరమేశ్వరుడి జాతర సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి టూరిజం శాఖ అధికారులతో సంప్రదించి రెండు బోట్లను ఏర్పాటు చేయించారు. పెద్దలకు, పిల్లలకు రూ.50 ధరను ఖరారు చేసినట్లు టూరిజం అధికారులు తెలిపారు. జాతర అనంతరం పరిస్థితులను బట్టి కొనసాగించాలా లేదా అన్నది త్వరలోనే వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు.

మూగజీవాలకు అందని వైద్యం

- మండలంలో 1.05లక్షల పశువులు
- పదేళ్లుగా మూతపడిన సంగినేనిపల్లి సబ్‌సెంటర్
- రెండేళ్లు సరఫరా కానీ నట్టల నివారణ మందులు



తూంకుంటలో శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల భవనం

వీపనగండ్ల: మూగజీవాలను సంరక్షించేందుకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటైన పశు వైద్యశాలలు, సబ్ సెంటర్లు కనీస వసతులకు నోచుకోవడం లేదు. దీనికి తోడు సిబ్బంది కొరత వేధిస్తుండడంతో పశువులకు సరైన వైద్యం అందట్లేదు. పశు వైద్యాధికారులు స్పందించి అవసరమైన వసతులు కల్పించాలని పాడి రైతులు, గొర్రెల కాపరులు కోరుతున్నారు.

మండల వ్యాప్తంగా..

మండలంలోని 14 గ్రామపంచాయతీల పరిధిలో లక్ష 5 వేల 411 మూగజీవాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అందులో తెల్ల పశువులు 5,570, గేదెలు, దున్నలు 3,525, గొర్రెలు 85,291, మేకలు 4,303, పందులు 722, కుక్కలు 1,800, కోళ్లు 4,200 ఉన్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

పేరుకే పశువైద్య కేంద్రాలు

మండల కేంద్రంతో పాటు కల్వరాలలో ప్రాథమిక పశువైద్య కేంద్రాలు ఏర్పాటు చేశారు. కల్వరాల వైద్యాధికారిని ఇటీవల శ్రీరంగాపూర్ మండలానికి డిప్యూటేషన్‌పై పంపించడంతో ఆ ఆస్పత్రి పరిధిలో ఉన్న పుర్గర్‌చర్ల, రంగవరం, గోపల్‌దిన్నె పరిధిలో పశువులకు సరైన వైద్యం లభించడం లేదు. సంగినేనిపల్లి సబ్‌సెంటర్‌లో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టుతో పాటు అటెండర్ పోస్టు ఉన్నా.. అటెండర్‌ను వీపనగండ్లకు డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో పదేళ్లుగా సంగినేనిపల్లిలో పశువైద్యశాల మూతపడి దర్శనమిస్తోంది. వీపనగండ్ల పశు వైద్యశాలకు అనుబంధంగా గోవర్ధనగిరి, తూంకుంట పశువైద్య ఉపకేంద్రానికి బొల్లారం, కొర్లకుంట, సంపత్‌రావుపల్లి గ్రామాలు, సంగినేపల్లి పశువైద్య ఉపకేంద్రానికి వల్లభాపురం తండాలను అనుబంధ గ్రామాలుగా ఉన్నాయి.

అరకొర మందులు

మండలంలోని పశు వైద్యశాలలకు రెండేళ్లుగా నట్టల నివారణ మందులు రావడం లేదని, బలం సూదులు, లివర్ టానిక్‌లు, గర్భధారణ సూదులు, చర్మవ్యాధులకు సంబంధించిన మందులు లేకపోవడంతో పలువురు రైతులు, గొర్రెల కాపరులు ప్రైవేటు వైద్యులను సంప్రదించి రూ.వేలు ఖర్చు చేసి పశువులకు వైద్యం అందిస్తున్నారు. తూంకుంట గ్రామంలోని పశువైద్య ఉపకేంద్రం కూలేందుకు సిద్ధగా ఉంది. మండల కేంద్రంలోని పశువైద్య ఆరోగ్య కేంద్రంలో సరైన వసతులు లేవు. క్యాంపుల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా పలు గ్రామాల్లోని ఆవులు, గొర్రెలు తరుచూ రోగాల బారిన పడుతున్నాయని వాపోతున్నారు.

జీవాలు మృత్యువాత



ప్రభుత్వం పశు వైద్య కేంద్రాలకు మందులు సరఫరాల చేయకపోవడంతో వైద్యం అందక పశువులు మృత్యువాత పడుతున్నాయి. మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం వద్ద పశువుల చికిత్స కోసం వినియోగించే బోను సరిగా లేకపోవడంతో రైతులు గాయాలకు గురయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలోని పశువైద్య శాలలో వసతులు మెరుగుపర్చాలి.

– ఎత్తం బాలస్వామి, వీపనగండ్ల

నిర్లక్ష్య ధోరణితోనే..



తమ గ్రామంలో సబ్ సెంటర్ మూతపడడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేయకపోగా తమ గ్రామానికి కేటాయించిన అటెండర్‌ను మరో గ్రామానికి డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో సబ్‌సెంటర్ మూతపడడంతో ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు నిర్వహిస్తాం.

– సత్యనారాయణగౌడ్, సగినేనిపల్లి

నివేదిక పంపుతాం



మండలంలోని పశువైద్య శాలలు, సబ్ సెంటర్లలో వసతులు మెరుగుపరచాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం. పశువులు, గొర్రెలకు రోగనిరోధక టీకాల పంపిణీ శిబిరం ఏర్పాటు చేశాం. అందుబాటులో ఉన్న వైద్య సిబ్బందితో జీవాలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

– గణేష్‌కుమార్, మండల పశువైద్య అధికారి వీపనగండ్ల

రేపు 'చలో హైదరాబాద్'



అమరచింత: తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సీపీఎస్ విధానం రద్దు చేయాలని హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మార్చి 2న ధర్నా నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల్లో ఆయా ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ నరసింహులు, ఏపీఎం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఆదివారం నిర్వహించే ధర్నాను జిల్లా, మండలాల్లో పనిచేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి కోరారు. శుక్రవారం మండలంలోని చందాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శంకరయ్యతో కలిసి ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి మనోహర్‌గౌడ్, ఈశ్వరయ్య, ప్రతాప్‌రెడ్డి, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న పోలీసులు

కొత్తకోట రూరల్: రూరల్ డెవలప్మెంట్ సొసైటీ, యాక్సిస్ టు జస్టిస్ వారి ఆధ్వర్యంలో బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ ఆనంద్ చేతుల మీదుగా విడుదల చేసినట్లు రూరల్ డెవలప్మెంట్ ప్రతినిధి హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ దేశంలో బాల్య వివాహాలు 23 శాతం ఉన్నాయని, 2026 నాటికి 10 శాతానికి తగ్గించి.. 2030 నాటికి పూర్తిగా బాల్య వివాహాల రహిత భారతదేశం నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ లక్ష్యాలను నిర్దేశించుకున్నాయన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించడానికి దేశవ్యాప్తంగా 217ఎన్‌జీఓలు 416 జిల్లాల్లో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాయన్నారు. వనపర్తి జిల్లాను పూర్తిగా బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చుకునేందుకు రావుల గిరిధర్ సైతం ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోలీస్ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రూరల్ డెవలప్మెంట్ సిబ్బంది అరుణ, రజినీకాంత్ తదితరులు ఉన్నారు.

'బీసీ ఎమ్మెల్యేలపై కుట్రలు చేయొద్దు'



మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

వనపర్తి: బీసీ ఎమ్మెల్యేలపై కుట్రలు చేయడం నిలిపివేయకపోతే మూల్యం చెల్లించుకుంటారని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని ఎంవైఎస్ ఫంక్షన్ హాల్‌లో బీసీ పొలిటికల్ జేఏసీ వనపర్తి జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలని రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బీసీ ఎమ్మెల్యేలపై కొందరు కావాలనే ఎటువంటి ఆధారాలు లేకుండా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. మార్చి 2న ముఖ్యమంత్రి వనపర్తి జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా సీఎం శంకుస్థాపన చేయనున్న నూతన నిర్మాణాలకు నిస్వార్థంగా సేవలందించిన దివంగత బీసీ ఎమ్మెల్యేల పేర్లు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వెంకటన్నగౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిరావాలి



ఖిల్లాఘనపురంలో మాట్లాడుతున్న అధికారులు

ఆత్మకూర్: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే ముఖ్యమంత్రి బహిరంగసభకు మండలంలోని మహిళలు తరలిరావాలని ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఏపీఎం సక్రునాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులు, సీసీలు, బుక్‌కీపర్లతో సమావేషమయ్యారు. సీఎం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని, ఆత్మకూర్ మండలం నుంచి 5 ఆర్టీసీ బస్సులు, మున్సిపాలిటీ నుంచి ఒక ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశామని, 300 మంది మహిళలు హాజరయ్యే చూడాలని సూచించారు.

ఖిల్లాఘనపురం: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే ముఖ్యమంత్రి సభను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ వెంకటాచారి, తహసీల్దార్ సుగుణ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, వీఓఏలతో వారు మట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలు చేస్తారన్నారు. మండలం నుంచి ప్రజలను తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లను గ్రామ స్థాయిలో పంచాయతీకార్యదర్శులు, సీసీలు, వీఓఏలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, ఏపీఎం రాంబాబు వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

పాన్‌గల్: కోతులు దాడి చేయడంతో మహిళ గాయపడిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత మహిళ, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తప్పెట శాంతమ్మ తన ఇంటి మిద్దెపైకి ఎక్కుతున్న క్రమంలో మిద్దెపై ఉన్న కోతుల గుంపు ఒక్కసారిగా మహిళపై దాడి చేశాయి. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు వచ్చి కోతులను వెళ్లగొట్టడంతో ప్రమాదం తప్పింది. దాడిలో మహిళ తలపై రెండు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రంలో కోతుల వలన ప్రతి రోజు ఎవరో ఒకరు గాయపడుతూనే ఉన్నా.. వీటిని నివారించేందుకు అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'భయం వీడితేనే క్షయను జయించగలం'

వీపనగండ్ల: భయం వీడి వైద్యాధికారుల సూచనలు పాటించినప్పుడే క్షయ నుంచి సురక్షితంగా బయటపడొచ్చని జిల్లా టీబీ నోడల్ ఆఫీసర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు తూంకుంటలో ఏర్పాటు చేసిన మొబైల్ టీబీ వైద్య శిబిరాలను పరిశీలించి వైద్యాధికారులు పలు సూచనలు ఇచ్చారు. దగ్గు, జ్వరం తరచూగా వస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో 100 రోజుల పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజశేకర్, ఆయుష్ డాక్టర్ కవిత, కేశవులు, హెల్త్ ఎడ్యుకేటర్ జహంగీర్, ఏఎన్‌ఎంలు రామచంద్రమ్మ, భారతి, టీబీ క్యాంపు సిబ్బంది ప్రవీణ్, రత్నం, అరుణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు



అచ్యుతాపురంలో ఉత్సవ విగ్రహాన్ని ఆలయంలోకి తీసుస్తున్న భక్తులు



కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో..

కొత్తకోట రూరల్: అమావాస్యను పురస్కరించుకొని శుక్రవారం కొత్తకోట మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ధ్యాన మందిరంలో రుద్రహోమం, లలితా సహస్రనామ స్తోత్రపారాయణం నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించడంతో పాటు అన్నదానం చేశారు.

వనపర్తి రూరల్: మండలంలోని అచ్యుతాపురం గుంటి పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు నవీన్‌కుమార్‌శర్మ స్వామివారికి అభిషేకం, అర్చన, నైవేద్యం, మహా మంగళహారతి, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వనపర్తి చెందిన శ్రీశైలం, ఇందిర దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో నరేందర్‌స్వామి, రమేష్‌శర్మ, ఆశన్ననాయుడు, కృష్ణ, శేఖర్, కిట్టుగౌడ్, నిరంజన్, నరేందర్, శివశంకర్ రెడ్డి, కృష్ణయ్య, మహేష్, శివకుమార్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం గ్రామానికి చెందిన గోనెల శంకర్, గోనెల శ్రీనివాసులు, గోనెల కృష్ణయ్య వారి తల్లిదండ్రులు బుచ్చన్న, శంకరమ్మల జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



ఆత్మకూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

వనపర్తి రూరల్: జిల్లాలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలిపారు. ఆత్మకూర్ మండల కేంద్రంలోని బాబా కాలనీలో టీఎన్జీవో భవనం పక్కన బంగారం శ్రీనివాసులు 20 ఫీట్ల రోడ్డును ఆక్రమించి షాపులను నిర్మిస్తున్నారన్నారు. షాపుల నిర్మాణం అడ్డుకొని, ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు సీపీఐ నాయకులు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతోపాటు పాన్‌గల్ మండలంలోని తెల్లరాళ్లపల్లిలో క్రీడా ప్రాంగణం స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించేందుకు క్రీడా ప్రాంగణం బోర్డును కూల్చివేసి అక్కడ చెట్లను కొట్టివేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, చిన్న కుర్మయ్య, పట్టణ కన్వీనర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కాపాడాలి

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వ స్థలాల్లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు తొలగించేంత వరకు పోరాటాన్ని ఉధృత చేస్తామని సీపీఐ జిల్లాకార్యదర్శి విజయరాములు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో రెండో రోజు నిరసన చేపట్టి తహసీల్దార్ చాంద్ పాషకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని బాబా కాలనీలో టీఎన్జీఓ భవనం పక్కన ఉన్న 20 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎంపీపీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వెంచర్లలో అన్యాక్రాంతమైన 10 శాతం ప్లాట్లను తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీహరి, మోషి, సీఎస్‌సెట్టి, అబ్రహం, భాస్కర్, కుతుబ్, రవీందర్, శేఖర్, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ శెట్టి, కుమార్, బాలస్వామి, రాంచందర్, గీత, కృష్ణవేణి, పద్మ, మాసమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

సైన్స్‌తోనే బంగారు భవిష్యత్



అమరచింతలో సైన్స్ పరికరాల ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: సైన్స్‌తోనే సమాజం ముడిపడి ఉందని, విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధిస్తే ఉన్నత లక్ష్యాలు సాధించొచ్చని డీఈఓ సుబ్రహ్మణ్యం, సైన్స్ ఉపాధ్యాయులు, వక్తలు అన్నారు. శుక్రవారం సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులు బహుమతులు అందించారు. కొన్ని పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించగా.. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం సైన్స్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కృష్ణయ్య, శ్రీనివాసులు, హెచ్‌ఎంలు విజయ్, మల్లికార్జున్‌గౌడ్, జమీల్, శ్రీనివాసులు, తూర్పింటి నరేష్‌కుమార్, పలుస శంకర్‌గౌడ్, భానుప్రకాష్, గణేష్‌కుమార్, గురువయ్యగౌడ్, చంద్రశేఖర్, ఏఏపీసీ చైర్మన్ అక్కల జ్యోతి, సైన్స్ ఉపాధ్యాయులు చిన్నగోపాల్, ఫకీరయ్య, వేణు, డాక్టర్ నాగరాజు, హేమలత, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



అమడబాకుల జెడ్పీహెచ్ఎస్‌లో..



వీపనగండ్లలో..



పెబ్బేరు మోడల్ స్కూల్‌లో..

త్రిఫ్ట్ ఫండ్ దరఖాస్తుల పరిశీలన



మగ్గం వివరాలు తెలుసుకుంటున్న జౌళిశాఖ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ అధికారి

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించి నివేదికను అందిస్తున్నామని జౌళిశాఖ కమిషనర్ కార్యాలయ అడిషనల్ డెవలప్‌మెంట్ అధికారి మహ్మద్‌షకీల్ తెలిపారు. పట్టణంలోని మగ్గాలపై జరీ చీరలను తయారు చేస్తున్న నేత కార్మికుల ఇళ్లకు వెళ్లి త్రిఫ్ట్ పండ్ కోసం దరకాస్తు చేసుకున్న వారి వివరాలను రెండురోజులుగా పరిశీలిస్తున్నమని వెల్లడించారు. జిల్లాలో 390 మగ్గాలకు జియో ట్యాగ్ నంబర్లు కలిగి ఉన్నాయని, మగ్గానికి ఇద్దరు కార్మికుల చొప్పున త్రిఫ్ట్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. జిల్లాలో కొత్తకోట, తిప్పుడంపల్లి, అమరచింత, వెల్టూర్, కల్వకుర్తి పట్టణాల్లో చేనేత కార్మికులు జియో ట్యాగ్ కలిగి ఉన్నారని తెలిపారు.

'యూపీఎస్‌పై యుద్ధభేరి' జయప్రదం చేయండి



పాన్‌గల్: తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టే 'యూపీఎస్‌పై యుద్ధభేరి' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బౌద్దారెడ్డి, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, చింతకుంట పాఠశాల జీహెచ్‌ఎం షేక్యానాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని చింతకుంట ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, మనోహర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, బక్కన్న, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.